జిల్లెలగూడలో కమ్యూనిటీ హాల్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడలోని రాఘవేంద్రనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను సోమవారం రాత్రి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్ల అభివృద్ధికి కృషిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్, మాజీ మేయర్ దుర్గాదీప్‌లాల్, మాజీ కార్పొరేటర్లు పద్మాఅంజయ్య, భూపాల్‌రెడ్డి, లావణ్యబీరప్ప, అనిల్‌యాదవ్, రాజేందర్‌రెడ్డి, లార్డ్ బీరప్ప, నవీన్‌గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ లెనిన్‌నగర్‌కు చెందిన పలువురు నాయీబ్రాహ్మణులు మంగళవారం కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

సరూర్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం మీర్‌పేట్‌శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను టీపీసీసీ ప్రధానకార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు తిరుపతయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐఐఎంహెచ్‌లో రాజస్థాన్ పీహెచ్‌డీ విద్యార్థులు

సైదాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్(ఎన్ఐఐఎంహెచ్)ను రాజస్థాన్ జోద్‌పూర్‌లోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆయుర్వేద విద్యాలయం పీహెచ్‌డీ విద్యార్థుల బృందం మంగళవారం సందర్శించారు. హెరిటేజ్ మ్యూజియం, లైబ్రరీ, ఔషధ మొక్కల ప్రదర్శనను పరిశీలించారు. ఎన్ఐఐఎంహెచ్ పురోగతి, సాధించిన విజయాలను అసిస్టెంట్ డైరక్టర్ ఇన్‌చార్జ్ డాక్టర్ గోలి పెంచల ప్రసాద్ వివరించారు.

ఓటరు జాబితాపై అఖిలపక్ష నేతలతో సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాపై హయత్‌నగర్‌లోని అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అఖిలపక్ష నేతలతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 14 గ్రామ పంచాయతీలకు సంబంధించి వార్డుల వారీగా ఓటరు జాబితాలో తొలగింపు, చేర్పులపై అఖిలపక్ష నేతలతో చర్చించారు. వార్డుల వారీగా జాబితా సవరణపై అభ్యంతరాలను స్వీకరించినట్లు ఎంపీడీవో శ్రీవాణి తెలిపారు. జాబితాపై వచ్చిన అభ్యంతరాల పరిశీలన అనంతరం ఈనెల 6వ తేదీన తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరిమెల వెంకటేష్, మాజీ వార్డు సభ్యుడు బొడిగె కొండల్‌గౌడ్, కొత్త ప్రభాకర్‌గౌడ్, రాసాల రాము యాదవ్, వేణుగౌడ్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వెలగని హైమాస్ట్ లైట్లు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారం-ఆర్‌కేనగర్‌కు వెళ్లే రోడ్డులో స్ట్రీట్ లైట్లు వెలగకపోవడంతో చీకట్లు అలుముకున్నాయి. ఆ రోడ్డులో హైమాస్ట్ స్తంభానికి ఉన్న లైట్లలో కేవలం ఒక్కటి మాత్రమే వెలుగుతోందని స్థానికులు తెలిపారు. అది కూడా ఒకసారి వెలుగుతూ మరోసారి ఆఫ్ అవుతోందన్నారు. దీంతో రోడ్డు మొత్తం చీకటిమయంగా ఉంటుందన్నారు. దీంతో రోడ్డు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సీఎం చొరవతో ప్రియదర్శిని పార్కు అభివృద్ధి

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కును అన్ని విధాలుగానూ అభివృద్ధి చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం హెచ్ఎండీఏ ఏఈ రంజిత్‌కుమార్ ఇతర అధికారులతో కలిసి ఆయన ప్రియదర్శిని పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కు అభివృద్ధి కోసం హెచ్ఎండీఏ అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రతిరోజు పార్కులో వందలాది మంది వాకింగ్ చేస్తుంటారని వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఎన్నడూ లేని విధంగా ప్రియదర్శిని పార్కును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉమేష్‌సింగ్, ప్రవీణ్‌రెడ్డి, రోహిత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోండి

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ వార్డు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ ప్రజలకు సూచించారు. మంగళవారం సరూర్‌నగర్ వార్డు కార్యాలయానికి వెళ్లి ఆమె సమీక్షించారు. బీజేపీ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు నరసింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు గోవర్ధన్ తదితరులున్నారు.

'రాష్ట్రంలో బీజేపీ బలపడేందుకు మందకృష్ణ కృషి'

దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అలజడులు సృష్టించి, బీజేపీ బలపడడానికి మంద కృష్ణ కృషిచేస్తున్నారని మాలల ఐక్య వేదిక అధ్యక్షులు బేర బాలకిషన్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమానికి పిలుపు నేపథ్యంలో మంగళవారం బేర బాలకిషన్‌ను సరూర్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. బేర బాలకిషన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాలు తెలుసుకోవాలన్నారు.

వీధిదీపాల ఏర్పాటుకు చర్యలు: కార్పొరేటర్

చంపాపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని కాలనీలు, బస్తీల్లో వీధిదీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ సుజాతనాయక్ అన్నారు. డివిజన్‌లోని హనుమాన్‌నగర్ కాలనీలో మంగళవారం కాలనీ ప్రతినిధులకు వీధి దీపాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్‌నగర్ కాలనీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మమత మల్లేష్‌గౌడ్, కాలనీ ప్రతినిధులు గంధం శ్రీను పాల్గొన్నారు.

7న లక్ష డప్పులు, వేయి గొంతులు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకు లక్ష డప్పులు, వేయి గొంతులు నినాదంతో ఈనెల 7న నిర్వహించే ర్యాలీకి మాదిగలు లక్షలాదిగా తరలిరావాలని టీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బట్టు దాస్‌రావు మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర గంట సుదర్శన్ మాదిగ, దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మైలపాక రాంచందర్ మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం శాలివాహననగర్ కాలనీ పార్క్ వద్ద టీఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ ఇచ్చిన పిలుపు మేరకు వారు డప్పుల ప్రదర్శన నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు రమేష్‌మాదిగ, యాదగిరి మాదిగ, అజయ్‌మాదిగ, మోజెస్, సంపత్‌మాదిగ, రామకృష్ణ, వెంకన్న పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై హర్షం



వనస్థలిపురం పోస్ట్ ఆఫీస్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నూతి శ్రీనివాస్, బీజేపీ నాయకులు



మాదన్నపేటలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సహదేవ్ యాదవ్



నాగోల్ చౌరస్తాలో పాల్గొన్న కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ తదితరులు

కేంద్ర బడ్జెట్‌పై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం చంపాపేట, ఎల్బీనగర్, నాగోల్, హయత్‌నగర్, వనస్థలిపురం, మాదన్నపేట, సరూర్‌నగర్ ప్రాంతాల్లో ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు.

ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక శాఖమంత్రి నిర్మలాసీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

చంపాపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని శ్రీరమణకాలనీ జడ్‌పీరోడ్‌లో మంగళవారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా బీజేపీ అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి హాజరై పీఎం నరేంద్రమోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ వికసిత భారత్ బడ్జెట్ 2025-2026 పేద, మధ్య తరగతి ప్రజలు, రైతుల సంక్షేమం కోసం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. పీఎం మోదీ నాయకత్వంలో రూపొందించిన డ్రీమ్ బడ్జెట్ అని అన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాధవరెడ్డి, రాజేంద్రప్రసాద్, రాజేందర్, వెంకటేష్‌గౌడ్, రాజుగౌడ్, అరుణసింగ్, సోమిరెడ్డి, శశిదర్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, శిరీష తదితరులు పాల్గొన్నారు.



హస్తినాపురం డివిజన్ శ్రీరమణకాలనీలో పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి



చంపాపేట డివిజన్ బైరామల్‌గూడలో పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

చంపాపేట డివిజన్‌లో

చంపాపేట డివిజన్ బైరామల్‌గూడలో మంగళవారం బీజేపీ నాయకులు పీఎం నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లింగాల దశరత్‌గౌడ్, తిరుపతి, కృష్ణగౌడ్, యోగిరాజ్, శ్రవణ్‌కుమార్, వేణుగోపాల్, వెంకటేష్, అంజి, శ్రీనివాస్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై బీజేపీ సంబరాలు

ఎల్‌బీనగర్: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం జనరంజకమైన బడ్జెట్ ప్రవేశపెట్టిందని బీజేపీ కుమ్మర సెల్ కన్వీనర్ మల్కాజిగిరి కుమార్ హర్షం వ్యక్తంచేశారు. కేంద్రంలో ప్రజాసంక్షేమ బడ్జెట్ ప్రవేశపెట్టినందున లింగోజిగూడలో బీజేపీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. 12 లక్షల వరకు వేతన జీవులకు పన్ను మినహాయించి భారీ ఊరటనిచ్చారన్నారు. పింఛనుదారులకు పన్ను మినహాయింపు ఇవ్వాలని నిర్ణయించడం గొప్ప విషమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కుమ్మర సెల్ కన్వీనర్ మల్కాజిగిరి కుమార్‌తో పాటు లింగోజిగూడ డివిజన్ బీజేపీ నాయకులు భాస్కర్, కృష్ణంరాజు, సంతోష్‌గౌడ్, రాములుగౌడ్, రాకేష్‌యాదవ్, కిరణ్, గట్టు రవి తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో

హయత్‌నగర్: బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మంగళవారం తుర్కయంజాల్, హయత్‌నగర్ చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. తుర్కయంజాల్ చౌరస్తాలో మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు ఏలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున్న బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ క్రమ శిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షుడు నరసింహగౌడ్, సీనియర్ నాయకుడు డప్పిగళ్ల రమేష్, తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం ఉపాధ్యక్షుడు కొత్త రాంరెడ్డి, మాజీ సర్పంచ్ అర్జున్‌గౌడ్, సీనియర్ నాయకులు శ్రావన్‌కుమార్‌గౌడ్, బాలకృష్ణగౌడ్, బిక్షపతి, కొంతం బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, విశాల్, సూరి, కొమ్ము శజవ తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ చౌరస్తాలో

మన్సూరాబాద్: పేద, మధ్యతరగతి ప్రజలు, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బీజేపీ కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ 2025-2026 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ బీజేపీ అధ్యక్షుడు పంగ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నాగోల్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్ యాదవ్, బీజేపీ నాయకులు బద్దం బాలకృష్ణగౌడ్, సిద్దాల ఐలయ్య పాల్వాయి సంజీవరెడ్డి, చంద్రశేఖర్ గుప్తా, పంగా శ్యామ్‌కుమార్, చంద్రశేఖర్ రావు, నరేష్ గౌడ్, శివకుమార్, సురేష్ కొప్పెర శ్యామల, కేశిరెడ్డి పద్మరెడ్డి, కె.లయ, గీతారెడ్డి, సరస్వతి, మమత పాల్గొన్నారు.

వనస్థలిపురంలో

వనస్థలిపురం: బీజేపీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వనస్థలిపురం పోస్ట్ ఆఫీస్ చౌరస్తాలో నరేంద్ర మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, అంజన్‌కుమార్‌గౌడ్, విజయ్‌కుమార్, క్రాంతిగౌడ్, వాసు, గీతా రెడ్డి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మాదన్నపేటలో

సైదాబాద్: కేంద్ర బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం మాదన్నపేటలో బీజేపీ నేతలు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సహదేవ్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ దేశాభివృద్ధిని ప్రోత్సహించే ప్రజారంజక బడ్జెట్‌గా కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బండ వెంకట్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేటలో...



బడంగ్‌పేట్‌లో మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న శ్రీరాములుయాదవ్

సరూర్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల వారికి పూర్తి సంతృప్తినిచ్చిందని, ఇది ప్రజారంజక బడ్జెట్ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం బడంగ్‌పేట్‌లో బీజేపీ క్లస్టర్-12 అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందెల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం అందెల మాట్లాడుతూ కేంద్రం తెలంగాణకు అన్నివేళలా అండగా నిలుస్తుందని, బడ్జెట్ విషయంలో ప్రతిపక్షాలు చేసే పసలేని ఆరోపణలను పట్టించుకోబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేశ్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, యాదగిరి, సంజీవరెడ్డి, మల్లారెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, నర్సింహారెడ్డి, లక్ష్మణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్

కొత్తపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణే ధ్యేయంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎల్‌బీనగర్ సీపీ క్యాంపులోని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ తెలిపారు. రాజీవ్ గాంధీనగర్ జెడ్‌పీహెచ్‌ఎస్ నుంచి 45 మంది విద్యార్థులు, మన్సూరాబాద్ కాకతీయ స్కూల్ నుంచి 40 మంది విద్యార్థులు రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. లెక్చర్ హాల్‌లో టీటీఐ అధికారులు వారికి ట్రాఫిక్ నిబంధనలపై యానిమేషన్ చిత్రాలను, రైమ్స్‌నూ ప్రదర్శిస్తూ నిబంధనలను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ అర్జున్ మాట్లాడుతూ పాఠశాలల విద్యార్థులకు చిల్డ్రన్ ట్రాఫిక్ ట్రెయినింగ్ పార్కులో, కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సాధారణ ప్రజలకూ, డ్రైవర్లకూ రహదారి భద్రత, నిబంధనల ప్రాధాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. నాచారం పరిధిలోని నాలుగు ప్రైవేటు పాఠశాలల వద్దా, నాచారం క్రాస్ రోడ్స్, ఉప్పల్ రామాంతపూర్ సిగ్నల్ వద్ద, స్ట్రీట్ నెం.8 జంక్షన్ తదితర 10 ప్రాంతాల్లో నిబంధలను అధికారులు వాహనాల డ్రైవర్లకు, యజమానులకు, ప్రజలకూ వివరించారని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు, సూచనలూ, రోడ్డు భద్రత, హెల్మెట్, సీటు బెల్టు ప్రాధాన్యం, మద్యం మత్తులో వాహనాలు నడిపితే అనర్థాలు, ప్రమాదాలపై అవగాహన కోసం తయారు చేసిన కరపత్రాలను 888 మందికి పంపిణీ చేశామన్నారు.

118 మందికి డీడీ కౌన్సెలింగ్

వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 59 మంది మందుబాబులకు 59 మంది కుటుంబ సభ్యుల సమక్షంలో సీపీ క్యాంపు వద్ద చిల్డ్రన్ పార్కు లెక్చర్‌హాల్‌లో మంగళవారం 6 విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో ఇన్‌స్పెక్టర్ అర్జున్ విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్ఓపీ అల్లూరయ్య కౌన్సెలింగ్, తనిఖీల ప్రాధాన్యతనూ వివరించారు. మద్యంమత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతున్నాయని, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ప్రమాదాల నివారణ కోసమేనని తెలిపారు. టీటీఐ సిబ్బంది రమేష్ కౌన్సెలింగ్‌కు హాజరైన వారికి అవగాహన కోసం వీడియో క్లిప్పులు, పాటలూ ప్రదర్శించారు.

నేటి నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం సాయంత్రం అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి. గురువారం శ్రీవారికి ప్రత్యేక పూలంగి సేవ, శోభాయాత్ర, మహవిశ్వశాంతి యజ్ఞం, సాయంత్రం ఆరున్నర గంటలకు శ్రీవారి అష్టాక్షరి మహాయజ్ఞం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం కమిటీ చైర్మన్ పూర్ణచందర్‌రావు తెలిపారు. 7వ తేదీన శ్రీవారి కల్యాణోత్సవం, అన్నసంతర్పణ, గరుడ వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం, సాయంత్రం శ్రీవారి పౌండరిక మహాశాంతి యజ్ఞం, శనివారం ఉదయం సుదర్శన పౌండరిక మహాయజ్ఞం, పూర్ణాహుతి, మధ్యాహ్నం తదితర సేవ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

శివపార్వతి అమ్మవార్ల వార్షిక...

వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని శివపార్వతి అమ్మవార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గురువారం ఉదయం నాగరాజు, నాగదేవత వద్ద ఈశ్వరుడికి సుబ్రహ్మణ్యేశ్వరుడికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, అగ్ని ప్రతిష్టాపన, ఈశ్వరుడికి రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉద్యమకారుల జయంతులను పండుగలా జరుపుకోవాలి : ఆర్ఎస్పీ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కృష్ణమాచారి తదితరులు

చంపాపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారుల జయంతి వేడుకలను పండుగలా జరుపుకోవాలని ఐపీఎస్ మాజీ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. హస్తినాపురం డివిజన్ కేకేగార్డెన్‌లో మంగళవారం తెలంగాణ విశ్వకర్మ మనుమయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచారి అధ్యక్షతన మనుమయ సంఘం వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి నుంచి మారోజు వీరన్న వరకు నిరుపేదల పక్షాన నిలబడి ప్రజలకు న్యాయం జరగాలని ఆకాంక్షించినట్లు పేర్కొన్నారు. సబ్బండవర్గాల కోసం నిరంతరం పోరాడిన మారోజు వీరన్న, ప్రొఫెసర్ జయశంకర్‌సార్, శ్రీకాంత్‌చారి జయంతిలను పండుగలా జరుపుకోవాలని కృష్ణమాచారి కోరారు. సంఘం గౌరవాధ్యక్షుడు గణేష్‌చారి, బాలాచారి, ప్రధాన కార్యదర్శి శ్రీరాములుచారి, కోశాధికారి శ్రీనివాసాచారి, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



సాహు బసంత్ రామ్(ఫైల్)

సైదాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కోసం చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి కుటుంబంతో వలస వచ్చిన ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బోర్సి ప్రాంతానికి చెందిన సాహు బసంత్ రామ్(65) జీవనోపాధి కోసం వారం రోజుల క్రితం కుటుంబంతో వలస వచ్చాడు. సైదాబాద్ లక్ష్మీనగర్ కాలనీ సాయిబాబా ఆలయం సమీపంలో భవన నిర్మాణ పనులు చేస్తూ అక్కడే నివాసముంటున్నారు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో బయటకు వెళ్లిన బసంత్‌రామ్ తిరిగిరాలేదు. సమీప ప్రాంతాల్లో అతడి ఆచూకీ వెతికినా లభించలేదు. దీంతో కుమారుడు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇనాంగూడ బంధంకుంటలో ప్రహరీ కూల్చివేత

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చెరువు, కుంటల పరిధిలో ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు పెడతామని మండల ఇరిగేషన్ ఏఈఈ వంశీధర్ హెచ్చరించారు. ఇనాంగూడలోని బంధంకుంటలో రమేష్‌బాబు అక్రమంగా ప్రహరీని నిర్మించాడు. ఈ విషయంపై ఫిర్యాదు అందుకున్న ఇరిగేషన్ ఏఈ వంశీధర్ సిబ్బందితో కలిసి మంగళవారం కుంటను సందర్శించారు. అక్కడ కొనసాగుతున్న నిర్మాణ పనులను నిలిపివేయించి, ప్రహరీని డోజర్ సహాయంతో నేలమట్టం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి పనులు చేపడితే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. త్వరలోనే అన్ని చెరువులు, కుంటలకు హద్దులను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

ముగ్దుం మొహియుద్దీన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



హయత్‌నగర్‌లో ముగ్దుం మొహియుద్దీన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

హయత్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రముఖ కవి, కామ్రేడ్ ముగ్దుం మొహియుద్దీన్ జయంతిని మంగళవారం సీపీఐ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కార్యదర్శి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి హాజరై ముగ్దుం మొహియుద్దీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రాచారి మొహియుద్దీన్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి శేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి నరసింహ, నాయకులు అరుణ్‌కుమార్‌గౌడ్, మర్రి శోభన్, సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, సక్కు నాయక్, వెంకట్, నాగరాజు, కృష్ణ, జ్యోతి, శ్రీధర్‌రెడ్డి, రాములు, అరుణ, సౌజన్య, సుమతి, అలివేణి, యమున తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక పద్ధతులతో బోధనలకు సిద్ధం కావాలి

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక పద్ధతులతో విద్యాబోధనలకు ఉపాధ్యాయులు సిద్ధం కావాలని నోబుల్ విద్యా సంస్థల చైర్మన్ ఆర్.రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని నోబుల్ డిగ్రీ కళాశాలలో జరిగిన అత్యాధునిక ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రధాన వక్త రాజేష్ ఫెర్నాడ్, కళాశాల ప్రిన్సిపాల్ విఠల్ పార్థసారథి, నోబుల్ డిగ్రీ కళాశాల, నవ్య జూనియర్ కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



పలు రకాల వంటకాలను అందజేస్తున్న విద్యార్థులు

నోరూరించిన ఫుడ్ ఫెస్టివల్

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చదువులోనే కాకుండా వంటకాల తయారీలోనూ ప్రతిభను చాటుకున్నారు దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీసాయి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు. మంగళవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌లో కేఎఫ్‌సీ చికెన్, చికెన్ పకోడా, హైదరాబాదీ చికెన్ బిర్యానీ తయారీ చేసి, కళాశాల ప్రాంగణాన్ని ఘుమఘుమలాడించారు. ఈ ఫెస్టివల్‌ను కళాశాల ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి ప్రారంభించగా, అధ్యాపకులు శేఖర్‌రెడ్డి, శ్రీనివాసాచార్యులు, వెంకటేశ్వర్లు, శోభారాణి, షర్మిల, సుష్మ, మమత, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.